'దర్తీ అబా అభియాన్'ను

సద్వినియోగం చేసుకోవాలి

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్



7



గురుకులాల నిర్వహణకు

పకడ్బందీ చర్యలు



కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి, పక్కన మంత్రి పొన్నం ప్రభాకర్, ఇరు జిల్లాల కలెక్టర్లు

- ఆకస్మిక తనిఖీలు నిర్వహించండి.. నిరంతరం పర్యవేక్షించండి
- మెనూ సక్రమంగా అమలయ్యేలా చూడాలి
- డిప్యూటీ సీఎం భట్టి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- బీసీ సంక్షేమం, రవాణా, ఎక్సైజ్ శాఖల ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్ష
- తాటి, ఈత వనాలు పెంచాలని సూచన
- ప్రతీ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించనున్నట్టు వెల్లడి

ఖమ్మం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గురుకులాల్లో విద్యాబోధన సక్రమ నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని, అధికారులు ఆకస్మిక తనిఖీలు చేస్తూ నిరంతర పర్యవేక్షణ చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉమ్మడి జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం ఖమ్మం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమం, రవాణా, ఎక్సైజ్ తదితర శాఖల అధికారులతో వారు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో గురుకలాల నిర్వహణ తీరు, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలతో పాటు బీసీ సంక్షేమశాఖ ద్వారా అమలవుతున్న పథకాలు, వనమహోత్సవంలో తాటి, ఈత, ఖర్జూర మొక్కల నాటడంపై ప్రాధాన్యత, ఆర్టీసీ సేవలపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ విద్యాసంత్సరం ప్రారంభం నాటికే విద్యార్థులకు (మిగతా 6వ పేజీలో)

ఊరికో బస్సు.. ఇంటికో దీపం

- అదే కాంగ్రెస్ పార్టీ నినాదం
- మహిళలకు ఉచిత ప్రయాణం కోసం ఆర్టీసీకి రూ. 6,210 కోట్లు ఇచ్చాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ నిర్వీర్యం
- ప్రజా ప్రభుత్వం వచ్చాక లాభాల బాట పట్టింది
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

7



అంబులెన్స్ వాహనాలను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం

నిరంతర విద్యుత్ సరఫరాకు పటిష్ఠ ప్రణాళిక

- 1912కు ఫోన్ చేస్తే అందుబాటులోకి విద్యుత్ అంబులెన్స్‌లు
- ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి, రవాణాశాఖ మంత్రి పొన్నం



ఆరుగాలం చెమటోడ్చి.. రెక్కలు ముక్కలు చేసుకుని అన్నదాతలు పండించిన పంటకు విలువలేకుండా పోతోంది. దళారులకు విక్రయించి నష్టపోవద్దు.. మోసపోవద్దంటూ ప్రభుత్వం జాగ్రత్తలు చెప్పిన నేపథ్యంలో అధిక శాతం మంది అన్నదాతలు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకున్నారు. కానీ కేంద్రాల్లోని అధికారులు కూడా అన్నదాతను నిలువునా దోచుకుంటున్నారన దానికి ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాలుగు కొనుగోలు కేంద్రాల్లో జరిగిన తతంగమే నిదర్శనంగా నిలుస్తోంది. వానాకాలం, యాసంగి పంటలకు సంబంధించి ధాన్యంలో తరుగు పేరుతో రైతులను లూటీచేశారన్న ఆరోపణలున్నాయి. అలాగే ఓ రైతు తెచ్చిన ధాన్యం బస్తాలకు.. అతడి ఖాతాలో పడిన డబ్బులకు సంబంధం లేదన్న విషయం కూడా చర్చనీయాంశమైంది.

తరుగు పేరిట..

రూ.కోటి కొట్టేశారు!

ఏదులాపురం సొసైటీలో ధాన్యం దందా

- వానాకాలం, యాసంగి వడ్ల కొనుగోళ్లలో గోల్‌మాల్
- కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లుల వరకు దోపిడీ
- రైతులను నిలువునా మోసగించిన అధికారులు, మిల్లర్లు
- కాంటాల లెక్కకు.. ఇచ్చిన డబ్బులకు పొంతన లేని వైనం
- ఓ రైతుకు చెందిన 13క్వింటాల ధాన్యం మాయం

ఖమ్మం రూరల్, జూన్18 (ఆంధ్రజ్యోతి): ఏదులాపురం సహకార సంఘం పరిధిలో మొత్తం 42గ్రామాలు, 11వేల మంది రైతులున్నారు. జిల్లాలోనే అతిపెద్ద సొసైటీల్లో ఒకటైన ఏదులాపురం సొసైటీ పరిధిలో వానాకాలంలో సుమారు 6,900ఎకరాలు, యాసంగిలో 4,600 ఎకరాల్లో ధాన్యం సాగయ్యింది. ఈ రెండు కాలాలకు సంబంధించి మొత్తం 2,87,500 క్వింటాల ధాన్యం పండింది. 2024 వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు గాను ఏదులాపురం సొసైటీ పరిధిలో కస్నాతండా, గోళ్లపాడు, తీర్దాల, గుదిమళ్లలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు సంబంధించి అధికారులు ఇచ్చిన లెక్కల ప్రకారం.. 609 మంది రైతుల నుంచి 26,627.60 క్వింటాల ధాన్యం కొన్నారు. అందుకు ఒక్కో బస్తాకు ప్రభుత్వం కేటాయించిన ధర రూ.2320 చొప్పున 26,627.60 క్వింటాలకు రూ. రూ.6.17కోట్ల పైచిలుకు అవుతుండగా.. సన్నరకానికి ప్రభుత్వం అందించిన బోనస్ రూ.500తో కలిపితే మొత్తం రూ.7.50కోట్లు దాటింది.

వేసవి కాలం పంట కొనుగోళ్ల కోసం ఏదులాపురం సహకార సంఘం పరిధి మళ్లీ అదే నాలుగు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆ కొనుగోలు కేంద్రాల్లో సొసైటీ అధికారులు ఇచ్చిన లెక్కల ప్రకారం 605మంది రైతులనుంచి 2,4362.80 క్వింటాల ధాన్యం కొన్నారు. వాటికి సంబంధించి క్వింటాకు ప్రభుత్వ ధర రూ.2,320 ప్రకారం.. మొత్తం 24,362 క్వింటాలకు వచ్చే మొత్తంతో పాటు క్వింటాకు రూ.500 బోనస్‌తో కలిపి రూ.6.87కోట్లకుపైగా సొమ్ములను రైతుల ఖాతాల్లో చేసినట్టు అధికారులు తెలిపారు.

తరుగు పేరుతో రైతు దోచుకున్నారు..

ఏదులాపురం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు వేసిన ధాన్యం కాంటాలకు, వారి ఖాతాల్లో జమయిన డబ్బులకు సంబంధం లేకుండా పోయింది. ఇక్కడే సొసైటీ అధికారులు, మిల్లర్లు కలిసి తరుగు పేరుతో రైతును లూటీ చేశారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. వానాకాలం సీజన్‌లో మొత్తం 27,713.60 క్వింటాలు, యాసంగిలో 25862.80 క్వింటాల (మిగతా 6వ పేజీలో)



మెప్పించిన 'మెర్సీ కిల్లింగ్'

- బాల నటికి గద్దర్ అవార్డు రాకతో వెలుగులోకి యువ దర్శకుడి ప్రతిభ
- తొలి చిత్రంతోనే డైరెక్షన్‌లో సత్తా చాటిన వల్లభ వాసి వెంకటరమణ

7

ఖమ్మం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కార్పొరేషన్‌లో దొంగ అసెస్‌మెంట్ల వ్యవహారంలో అవినీతి అధికారుల మెడకు ఉచ్చు బిగుస్తున్నట్టు తెలుస్తోంది. కార్పొరేషన్ పరిధిలో వేసిన అసెస్‌మెంట్ల విషయంలో విజిలెన్స్ అధికారులు లోతైన విచారణ నిర్వహిస్తున్నారు. గతంలోనే కొందరు కార్పొరేషన్ అధికారులు ప్రభుత్వ భూములు మొదలుకుని నిర్మాణాలు లేని వాటికి, ఎకరాల్లో ఉన్న భూములకు ఇష్టారీతిన అసెస్‌మెంట్లు వేసిన అంశాలు వెలుగులోకి వచ్చాయి. వాటిపై ఇప్పటికే విజిలెన్స్ విచారణ కొనసాగుతుండగా.. అసైన్డ్ భూములకు అసెస్‌మెంట్లు వేసిన సంఘటనపై మరో కోణంలో విజిలెన్స్ అధికారులు విచారణ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం బల్లేపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే 137,138లలో ఫీల్డ్ ఎంక్వైరీ నిర్వహించేందుకు వారు ఖమ్మం రానున్నట్టు ఇప్పటికే వరంగల్ రిజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ నుంచి కార్పొరేషన్ అధికారులకు లేఖ పంపారు. కాగా ఆ విచారణ నిర్వహించే సమయంలో కార్పొరేషన్‌కు సంబంధించి సంబంధిత అధికారులను హాజరుకావాలని విజిలెన్స్ అధికారులు సూచించడంతో కార్పొరేషన్‌లోని టౌన్ ప్లానింగ్ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు ఉన్నతాధికారులు బుధవారమే ఆదేశాలు జారీ చేశారు.

మూలాలు మున్సిపల్ కార్పొరేషన్‌లోనే..

ప్రభుత్వ స్థలాలను కాజేసేందుకు అక్రమార్కులు వేసే పన్నాగాల్లోనూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకంలో భాగంగా (మిగతా 6వ పేజీలో)



'ఆంధ్రజ్యోతి' జిల్లా పత్రికలో ప్రచురితమైన కథనం..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అసెస్‌మెంట్లపై..

బిగుస్తున్న ఉచ్చు!

- నేడు అసైన్డ్ భూమి అంచనాలపై విజిలెన్స్ విచారణ
- ఖమ్మం బల్లేపల్లి రెవెన్యూలో ఫీల్డ్ ఎంక్వైరీ
- కార్పొరేషన్ అధికారులకు అందిన అదనపు ఎస్పీ లేఖ
- ఇప్పటికే పలు ప్రభుత్వ శాఖల నుంచి నివేదికలు
- దొంగ అసెస్‌మెంట్లను వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'

గూడు కూలింది.. గోడు మిగిలింది

- నత్తనడకన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు
- 'పైలెట్ ప్రాజెక్టు'లోనూ అరకొర పనులే
- అధికారుల మధ్య కొరవడిన సమన్వయం

వివరాలు : 6లో

ప్రబలుతున్న వ్యాధులు

- జ్వరం, ఒళ్లు నొప్పులతో పీహెచ్‌సీకి క్యూ
- వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలంటున్న చంద్రుగొండ మండల ప్రజలు

వివరాలు : 6లో

ఎస్సీ ఉద్యోగుల సంక్షేమానికి సింగరేణి చర్యలు అభినందనీయం

ఎస్సీ చీఫ్ లైజన్ ఆఫీసర్ దుర్గం రాంచందర్



రోస్టర్ రిజిస్ట్రర్లను పరిశీలించిన ఎస్సీ లైజన్ ఆఫీసర్ల ప్రతినిధి బృందం

రుద్రంపూర్, (సింగరేణి) జూన్ 18 (ఆంధ్రజ్యోతి):సింగరేణిలో ఎస్సీ ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని ఎస్సీ ఉద్యోగుల చీఫ్ లైజన్ ఆఫీసర్ దుర్గం రాంచందర్ తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను యాజమాన్యం పకడ్బందీగా అమలు చేస్తుందన్నారు. బుధవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలోని రిక్రూట్‌మెంట్ సెల్‌లో రోస్టర్ రిజిస్ట్రర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ నియామకాలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను సక్రమంగా అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రిక్రూట్‌మెంట్ సెల్ జీఎం నికోలస్, లైజన్ ఆఫీసర్ మాల కొండయ్య, ఎస్సీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు రాజేశ్వర్, వెంకటేశ్వరరావు, అంతోటి నాగేశ్వరరావు, డీజీఎం వేణుగోపాల్‌రావు, పర్సనల్ మేనేజర్ ప్రకాష్‌రావు, కమిటీసభ్యులు అంకూస్, విజేందర్, నాగరాజు, ప్రవీణ్‌కుమార్, మధుకృష్ణ, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

సన్న వరి విత్తనాలు సిద్ధం

- విత్తనాభివృద్ధి సంస్థ ఉమ్మడి జిల్లా యూనిట్‌లో నిల్వలు
- అందుబాటులో 25 కిలోల సంచులు
- 4 కిలోల బ్యాగుల్లో అపరాల విత్తనాలు కూడా..
- పీఏసీఎస్‌లు, రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయానికి ఏర్పాట్లు

ఖమ్మం వ్యవసాయం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వానా కాలం సాగుకు రైతన్నలు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం వివిధ పంటలకు సంబంధించిన విత్తనాలను అందుబాటులో ఉంచింది. ఈ మేరకు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఉమ్మడి ఖమ్మం జిల్లా యూనిట్ యంత్రాంగం వరి, అపరాల విత్తనాల సంచులను విక్రయిస్తోంది. వరిలో విదేశీ డిమాండ్ ఉన్న సన్న రకాలను ప్రభుత్వం ప్రోత్సహించడంతో పాటు సన్న రకాలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పాటు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ కూడా ఇస్తోంది. దీంతో రైతులు కూడా వరి సాగులో సన్న రకాల సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఇందుకు అనుగుణంగా రాష్ట్రవిత్తనాభివృద్ధి సంస్థ జిల్లాల వారీగా నీటి వనరులు, నేలల రకాలు, వ్యవసాయ శాఖల ఇండెంట్ల ఆధారంగా వరిలో సన్న రకాలను అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తోంది. ఈ క్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించి బీపీటీ 5204 రకంతో పాటు కేఎన్ఎం 1638 వరి విత్తనాలను సిద్ధం చేశారు. ఇక మెట్ట పంటలైన పెసర, మినుము విత్తనాలను కూడా సంస్థ అందుబాటులో ఉంచింది. ఈ విత్తనాలను ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్), ఆగ్రో రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయించేందుకు ఏర్పాట్లు చేశారు.



అందుబాటులో ఉన్న విత్తన రకాలిలా..

వరిలో బీపీటీ 5204, కేఎన్ఎం 1638 సన్న రకాల విత్తనాలను సిద్ధం చేశారు. ఇప్పటికే ఖమ్మం జిల్లాలోని విత్తన విక్రయ కేంద్రాల్లో బీపీటీ 5204 రకం 2,943 క్వింటాళ్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 807 క్వింటాళ్లు, కేఎన్ఎం 1638 రకం ఖమ్మం జిల్లాలోని విక్రయ కేంద్రాల్లో 187 క్వింటాళ్లు అందుబాటులో ఉంచారు. ఖమ్మం జిల్లాలో పెసలు ఎంజీజీ 295 రకం 10 క్వింటాళ్లు, ఎంజీజీ 385 రకం 130 క్వింటాళ్లు, మినుములు బీజీ పీయూ-31 రకం 35 క్వింటాళ్లు అందుబాటులో ఉంచారు. ఇవిగాక ఖమ్మం విత్తనాభివృద్ధి సంస్థ యూనిట్‌లో బీపీటీ 5204 రకం వెయ్యి క్వింటాళ్లు, కేఎన్ఎం 1638 రకం 180 క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నాయి.

విత్తన ధరలు ఇలా..

బీపీటీ 5204 వరి విత్తనాలు 25కిలోల బ్యాగు రూ.950, వరి కేఎన్ఎం-1638 రకం 25 కిలోలకు రూ.950గా నిర్ణయించారు. అలాగే పెసలు ఎంజీజీ-295 4కిలోల సంచికి రూ.506, పెసలు ఎంజీజీ 385 4కిలోలకు రూ.506, మినుములు పీయూ-31 4కిలోలకు రూ.463గా ఉంది.

రెండు రకాల రాయితీ ఆఫర్లు..

వానాకాలం సాగు చేసే రైతులకు విత్తనాభివృద్ధి సంస్థ ఓ ఆఫర్ ప్రకటించింది. ఖమ్మం విత్తనాభివృద్ధి సంస్థ నుంచి రైతులు నేరుగా విత్తనాలను కొనుగోలు చేస్తే వారికి విత్తన ధరలో 6 శాతం రాయితీ ప్రకటించింది. రైతులు సమూహంగా ఏర్పడి 2 టన్నుల విత్తనాలను ఆర్డర్ చేస్తే దానికి కూడా 6 శాతం రాయితీ సౌకర్యం కల్పించారు. అంతేకాకుండా ఎలాంటి రవాణా చార్జీలు లేకుండా ఆయా గ్రామాలకు సంస్థే విత్తనాలను రవాణా చేసే సౌకర్యం కల్పించింది.

21న జాబ్‌మేళా

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్18 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని బస్ డిపో రోడ్డులోని మేకల బిక్షమయ్య కాంప్లెక్స్‌లో ఈనెల 21న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె.రవిబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023-24, 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్ వారి ఆధ్వర్యంలో ఐటీ, డీపీవో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్ గ్రూప్ విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో 75 శాతం మార్కులు సాధించినవారు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హులైన వారు ఈ నెల 21న ఉదయం 9 గంటల నుంచి నిర్వహించే జాబ్ మేళాలో పాల్గొనాలని పాల్గొనే విద్యార్థులు పదో తరగతి మెమో, ఆధార్‌కార్డు, ఇంటర్మీడియట్ పాస్ సర్టిఫికెట్, ఆన్‌లైన్ సర్టిఫికెట్, ఆండ్రాయిడ్ మొబైల్, పాస్‌పోర్టు సైజు ఫొటోతో హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8341405102 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

టెట్ ప్రారంభం

- జూన్ 30వరకు 16 విడతల్లో పరీక్షలు..
- జిల్లాలో ఒకే కేంద్రం ఏర్పాటు..

కొత్తగూడెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీజీ-టెట్) బుధవారం నుంచి ప్రారంభమైంది. పూర్తిగా కంప్యూటర్ బెస్డ్‌గా.. రోజుకు రెండు షిఫ్ట్‌ల్లో నిర్వహించనున్నారు. ఉదయం 9.30 నుంచి 11.30వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఇంకో సెషన్‌లో పరీక్ష జరగనుంది. జూన్ 30వ తేదీవరకు 16 విడతల్లో పరీక్షలు జరుగుతాయని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు టెట్ చైర్మన్ నికోలస్ తెలిపారు. జిల్లాలోని అబ్దుల్ కలాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజికల్ సైన్సెస్ పరీక్ష కేంద్రంలో పేపర్ -1కు 120మందికి గాను 104మంది, పేపర్ - 2 కు 120మంది మొత్తం 110మంది హాజరయ్యారని కోఆర్డినేటర్ అయూబ్ తెలిపారు. తొలిరోజు పేపర్ -1 కు 16మంది, పేపర్ - 2కు 10మంది మొత్తం 26మంది గైర్హాజరు అయ్యారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో టెట్ పరీక్ష రాయాలని, ఎటువంటి ఒత్తిడికి లోనుకావొద్దని, పరీక్షలకు సర్వం సిద్ధం చేశామని, పరీక్ష కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ఇన్విజిలేటర్ల దృష్టికి తీసుకురావాలని, పరీక్షలకు సకాలంలో హాజరుకావాలని టీజీ టెట్ కోఆర్డినేటర్ అయూబ్ తెలిపారు.

గూడు కూలింది.. గోడు మిగిలింది

- నత్తనడకన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు
- పైలట్ ప్రాజెక్టులోనూ అరకొర పనులే
- అధికారుల మధ్య కొరవడిన సమన్వయం

దుమ్ముగూడెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గూడు కోసం వేయికళ్లతో ఎదురుచూసే నిరుపేదలకు నిరాశ తప్పడంలేదు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని ఆశ పడాలో, ఉన్న గుడిసెలు కూల్చుకొని పరాయి వాళ్ల పంచన చేరామని బాధపడాలో అర్థకాని అయోమయ పరిస్థితి నెలకొంది. మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రక్రియ నత్తనడకన సాగుతుండడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోస్తారు, గుడిశెలను తొలగించమని కొందరు పంచాయతీ కార్యదర్శులు చెప్పడం తో లబ్ధిదారులు ఎంతో ఆశపడి ఉన్న ఇళ్లను పీకి పక్కన పెట్టారు. అయితే ఇంటి నిర్మాణ కొలతలకు ముగ్గు పోసే ప్రక్రియను చేపట్టాల్సిన హౌజింగ్ అధికారి అందుబాటులో ఉండడం లేదనే విమర్శ ఉంది. దీంతో ఉన్న గుడిశెలను తొలగించిన లబ్ధిదారులు ముగ్గు ఎప్పుడు పోస్తారో, ఇళ్ల నిర్మాణం ఎప్పుడు చేస్తారో అని ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలం సమీపించడంతో ఇసుక దొరుకుతుందో లేదో అని ఆందోళన చెందుతుండగా, ఒకవేళ దొరికినా ధర అందుబాటులో ఉంటుందో లేదో అని భయపడుతున్నారు. ఆర్నెళ్ల క్రితం పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన పెదకమలాపురం గ్రామపంచాయతీలో ఇళ్ల నిర్మాణ పురోగతి అంతంత మాత్రంగానే ఉంది.

మండలంలో 949 ఇళ్లు మంజూరు

మండల వ్యాప్తంగా 36 గ్రామపంచాయతీల పరిధిలో మొత్తం 949 ఇందిరమ్మ ఇళ్లు, పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన పెదకమలాపురం పంచాయతీలో 202 మంజూరయ్యాయి. మే 31న మంజూరైనట్లుగా లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. 400 నుంచి 600 చదరపు అడుగుల లోపు ఆర్‌సీసీ శ్లాబు రెండు గదులతోపాటు వంటగది, మరుగుదొడ్డిని తప్పనిసరిగా నిర్మించాలి. పునాది నిర్మాణం తర్వాత మొదటి బిల్లు రూ.లక్ష, గోడలు కట్టిన తర్వాత రెండో బిల్లు రూ.లక్ష, శ్లాబు వేసిన తర్వాత రూ.2లక్షలు, నిర్మాణం పూర్తయిన తర్వాత రూ.లక్షల బిల్లు కలిపి మొత్తం రూ.5లక్షలను చెల్లిస్తారు. అయితే ఉత్తర్వులు అందిన తర్వాత 45 రోజుల లోపు ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించి సంవత్సరం లోపు పూర్తి చేయాలనే నిబంధన ఉంది.

నత్తనడకన ఇళ్ల నిర్మాణాలు

మండల వ్యాప్తంగా మంజూరైన ఇళ్లలో కేవలం పదిశాతం కూడా ప్రారంభం కాలేదని తెలుస్తోంది. కొంతమంది లబ్ధిదారులు నిర్మాణానికి ఆసక్తి కనబరుస్తున్నప్పటికీ, హౌజింగ్ అధికారి సకాలంలో ఇంటి నిర్మాణ కొలతలకు ముగ్గుపోయడం లేదనే విమర్శలున్నాయి. మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీలు కాగా, హౌజింగ్ అధికారి ఒక్కరే కావడంతో కూడా ఈ పరిస్థితి నెలకొన్నట్లు కనబడుతోంది.

ఆ నిబంధన అమలైతే?

ఉత్తర్వులు అందిన నలభై ఐదు రోజుల లోపు పనులు ప్రారంభించాలనే నిబంధన కచ్చితంగా అమలైతే, అధికారుల తాత్సారంతో పదిశాతం ఇళ్ల నిర్మాణాలను కూడా ప్రారంభించలేమని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. కొందరు బేస్‌మెంట్ నిర్మాణం కోసం డబ్బులు లేక తమ జీవనోపాధి అయిన ఎద్దులను విక్రయించగా.. మరి కొందరు వడ్డీలకు డబ్బులు తెచ్చి ఇంట్లో పెట్టుకున్నారు.

పైలట్ ప్రాజెక్టులోనూ అరకొర పనులే..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం 2025 ఏప్రిల్ నెలలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన పెద కమలాపురం గ్రామపంచాయతీలోనూ పనులు అరకొరగానే జరిగాయి. మొత్తం 202 ఇళ్లు మంజూరవగా, కేవలం 22 మాత్రమే మొదలయ్యాయి. తాజాగా ఎనిమిది మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం కోసం ముగ్గుపోయించుకోగా, ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో వారి ఫొటోలు అప్‌లోడ్ కాకపోవడంతో అయోమయ పరిస్థితి నెలకొంది. సుమారు నెల రోజులుగా పంచాయతీ కార్యదర్శి యాప్ పనిచేయడం లేదు. దీనిపై ఉన్నతాధికారులు సైతం సరైన సమాచారం ఇవ్వడం లేదని తెలుస్తోంది. పైలట్ ప్రాజెక్టులోనే ఇలా తాత్సారం జరిగితే మిగతా ఇళ్ల నిర్మాణం పరిస్థితి ఏంటనే సందేహాలు లబ్ధిదారులను అయోమయానికి గురిచేస్తున్నాయి.



కూల్చివేసిన ఓ లబ్ధిదారుడి గుడిసె

ఉన్న ఇల్లు తొలగించాం: లబ్ధిదారుడు



తన భార్య ఆశ పేరుతో ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. నిర్మాణం కోసం ముగ్గుపోయిస్తామని పంచాయతీ కార్యదర్శి చెబితే పదిహేను రోజుల క్రితం ఉంటున్న గుడిశెను తొలగించి అద్దె ఇంట్లోకి చేరాం. కార్యదర్శిని అడిగితే పైనుంచి అధికారులు రావాలని అంటున్నారు. గోదావరి నదికి ప్రవాహం పెరిగితే ఇసుక దొరకదు. ఒకవేళ దొరికినా రేటు ఎక్కువగా ఉంటుంది. రోజులు గడవడంతో బేస్‌మెంట్ కోసం తోలించిన ఇసుక చెల్లాచెదురవుతోందని దుమ్ముగూడెం పంచాయతీ ఆవాసప్రాంతం వర్కుషాపునకు చెందిన అందుగుల శేఖర్ ఆవేదన వ్యక్తం చేశాడు.

ముగ్గు పోస్తున్నాం : ఏఈ

అవసరమైన చోట మేస్త్రీలతో ఫోన్‌లో మాట్లాడి ముగ్గు పోయిస్తున్నామని హౌజింగ్ ఏఈ సమాధానమిచ్చారు. మండల వ్యాప్తంగా పదిశాతం పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. పనులను ప్రారంభించే ముందు మేస్త్రీలు తనతో మాట్లాడితే కొలతలు చెబుతానన్నారు. అయితే క్షేత్రస్థాయిలో కార్యదర్శులు ఈ బాధ్యత తీసుకోవాలన్నారు.



ఎన్‌సీసీ బెటాలియన్ సిబ్బందితో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ నర్సింగ్‌సైలాని

ఖమ్మం ఎన్‌సీసీ బెటాలియన్‌ను సందర్శించిన ఉన్నతాధికారులు

ఖమ్మం స్పోర్ట్స్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): 11 తెలంగాణ ఎన్‌సీసీ బెటాలియన్‌ను బుధవారం ఏపీ, తెలంగాణా రాష్ట్రాల ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమాండర్ నర్సింగ్‌సైలాని సందర్శించారు. ఈ సందర్భంగా క్యాడెట్లు గార్డ్ ఆఫ్ హానర్‌ను సమర్పించారు. అనంతరం ఫైరింగ్ టీమ్‌కు ఎంపికైన నగరంలోని కేఎండీసీ కళాశాలకు చెందిన గుగులోత్ విశాల్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్, వీర్‌చక్రర అవార్డు గ్రహీత కల్నల్ సచిన్ నింబాల్కర్, 11 తెలంగాణ బెటాలియన్ కమాండెంట్ కల్నల్ సంజయ్‌కుమార్ భద్ర, పలువురు ఏన్‌వోలు ఉన్నారు.

ప్రబలుతున్న వ్యాధులు

జ్వరం, ఒళ్లు నొప్పులతో పీహెచ్‌సీకి క్యూ



పీహెచ్‌సీకి వచ్చిన ప్రజలు

చంద్రుగొండ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): చంద్రుగొండ మండలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇప్పటికే పలు గ్రామాల్లో జ్వరం, ఒళ్లు నొప్పులతో పాటు జలుబు, గొంతు నొప్పి తదితర వ్యాధులతో ప్రభుత్వ, ప్రైవేటు ఆరోగ్య కేంద్రాలకు రోగులు క్యూ కడుతున్నారు. ముఖ్యంగా చంద్రుగొండలోని ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రికి నిత్యం వందలాది మంది రోగులు చికిత్స చేయించుకునేందుకు రాగా వారిలో కొందరికి వ్యాధి తీవ్రత అధికంగా ఉంటుండటంతో వైద్యులు ఆస్పత్రిలో ఉంచి వైద్యం అందిస్తున్నారు. కాగా ఇప్పటికే ఉన్నతాధికారులు పలు మార్లు ఆస్పత్రిని సందర్శించి సీజనల్ వ్యాధులను నియంత్రించేందుకు తీసుకోవాల్సిన చర్యలను స్థానిక వైద్యులు, సిబ్బందికి సూచించారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

మండలంలోని కొన్ని గ్రామాల్లో ప్రతి సంవత్సరం సీజనల్ వ్యాధులు విజృంభిస్తుంటాయి. ఆ గ్రామాల్లో ప్రతి ఇంటిలోనూ ఇద్దరు, ముగ్గురు తీవ్ర అనారోగ్యం బారిన పడుతుంటారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తుగానే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కాగా తిప్పపల్లిల్లో తొలి వైద్య శిబిరం ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, వ్యాధుల ప్రబలుతున్న గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తామని స్థానిక వైద్యాధికారి తనూజ తెలిపారు.

పంచాయతీల అధికారులు బాధ్యత తీసుకోవాలి

గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణ అంతంత మాత్రంగా ఉంది. దీనిపై ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు ప్రత్యేక దృష్టిసారించి మురుగు నీరు, దోమలు, ఈగల నివారణకు చర్యలు తీసుకుంటూ ప్రజలను సైతం అప్రమత్తం చేయాల్సిన బాధ్యత పంచాయతీల అధికారులపై ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. దాంతో పాటు వాటర్ ట్యాంకులను శుభ్రపరచటం, పైపులైన్లు లీకేజీలు లేకుండా చేయటంపై మిషన్ భగీరథ, పంచాయతీల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పలువురు కోరుతున్నారు.

రామయ్య ఉత్సవమూర్తులకు అభిషేకం

భద్రాచలం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఉత్సవ మూర్తులకు అభిషేకం నిర్వహించారు. ప్రతి బుధవారం ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించడం సంప్రదాయం. అనంతరం స్వామి వారిని అందంగా అలంకరించి నిత్య కల్యాణాన్ని నిర్వహించారు. ఈ సమయంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం →

తరుగు పేరిట.. రూ.కోటి కొట్టేశారు!

(5వ పేజీ తరువాయి)

ధాన్యాన్ని కాంటాలు వేసిన అధికారులు.. వాటిలో నుంచి సుమారు 2586 క్వింటాల ధాన్యాన్ని తరుగు పేరుతో తీసేసి రైతులకు డబ్బులు చెల్లించినట్లు తెలుస్తోంది. అయితే తరుగు పేరుతో తీసేసిన ధాన్యం ధర, బోనస్ మొత్తం కలిపి సుమారు రూ.కోటి వరకు అధికారులు, మిల్లర్లు కలిసి లూటీ చేశారని రైతులు ఆరోపిస్తున్నారు.

రసీదు లేదు..

రైతులు తెచ్చిన ధాన్యాన్ని కాంటా వేసుకుని.. లోడ్ చేసుకునే ముందు రైతుకు సంబంధించి ఎన్ని క్వింటాల ధాన్యం కాంటా వేసుకున్నారో ఆవివరాలతో రైతుకు రసీదు(ట్రక్ షీట్) ఇవ్వాల్సి ఉంటుంది. కానీ రైతులకు ఎలాంటి రసీదులు ఇవ్వకుండానే మిల్లులకు తరలించారు. ఈ క్రమంలో రైతులు తమ ఖాతాల్లో డబ్బులు పడిన తరువాత అవాక్కయ్యారు. తాము కాంటా వేసిన ధాన్యానికి వచ్చే డబ్బులకు తమకు ఇచ్చిన డబ్బులకు సంబంధం లేకపోవడంతో లబోదిబోమంటున్నారు. ఇదేంటని రైతులు సొసైటీ అధికారులను అడిగితే మిల్లుల వద్ద కటింగ్ అయిందని, అందరికీ అలాగే జరిగిందని, వచ్చిన వరకు తీసుకోవాల్సిందేనని అధికారులు స్పష్టం చేయడంతో రైతులు మిన్నకుండిపోతున్నారు. ఈ తరుగు పేరుతో సొసైటీ అధికారులు, మిల్లర్లు మండలంలో వానాకాలం, యాసంగి కలిపి సుమారు రూ.కోటి మేరకు నొక్కేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తరుగు పేరుతో కోత కోసి డబ్బులను ఇప్పించాలని రైతులు వేడుకుంటున్నారు.

రైతులకు చెప్పే తరుగు తీశాం

మహ్మద్ అలీ, ఏదులాపురం సొసైటీ సీఈవో

ఖరీఫ్, రబీ పంటలకు సంబంధించి రైతుల ధాన్యం లోడ్లు మిల్లులకు పంపించగా అక్కడ మిల్లర్లు లోడ్లు దించుకోకపోవడంతో వారు క్వింటాకు సుమారు 5 నుండి 6 కేజీల తరుగు తీశారు. ఈ విషయం రైతులకు చెప్పడం జరిగింది. రైతు ధాన్యం పొరపాటున లెక్కలో మిస్సింగ్ అయ్యాయి. వాటిని మిల్లువద్ద రికవరీ చేశాము. రైతుకు డబ్బులు ఇప్పిస్తామని చెప్పాను. కేంద్రాల్లో కాంటాలు వేసిన తరువాత రైతుకు రసీదులు ఇవ్వక పోవడం పొరపాటు జరిగింది.

80 క్వింటాలకు 7 క్వింటాలు కటింగ్ పెట్టారు

మిడకంటి కవిత, పోలేపల్లి



ఐదెకరాలు కౌలుకుతీసుకుని వరి సాగు చేశా. మొత్తం 80క్వింటాల ధాన్యం పండగా.. పోలేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించా. నేను కాంటా వేసిన 80క్వింటాలకు ఏడు క్వింటాళ్ల కోత పెట్టి రూ.లక్షా84వేలు రావాల్సింది రూ.14 వేలు కట్‌చేసుకున్నారు. ఇదేంటని సొసైటీ అధికారిని అడిగితే అందరికీ ఇలాగే కటింగ్ అయి వచ్చాయని చెబుతున్నారు.

13 క్వింటాల ధాన్యం మాయం చేశారు

సంపెట నవీన్, పోలేపల్లి.

13క్వింటాల ధాన్యాన్ని ఏదులాపురం సొసైటీ కొనుగోలు కేంద్రంలో 30 రోజుల క్రితం విక్రయించా. డబ్బులు పడలేదని సొసైటీ అధికారిని అడిగితే తొలుత నీ ధాన్యం గురించి తెలియదన్నారు. ఆ వాటికి సంబంధించిన డబ్బును బోనస్ లేకుండా రూ.31వేలు నా సొంతంగా ఇస్తానని సొసైటీ అధికారి చెప్పారు. కానీ నేటి వరకు నా డబ్బులు ఇవ్వడంలేదు.



అసెస్‌మెంట్లపై.. బిగుస్తున్న ఉచ్చు!

(5వ పేజీ తరువాయి)

భూములను క్రమబద్ధీకరించుకునే అంశంలోనూ, ప్రస్తుతం అసైన్డ్ భూములకు సంబంధించి యజమానుల వివరాలను మార్పులు చేసి హక్కులు కట్టబెట్టడంలోనూ.. ఇలా ప్రతీ అంశంలోనూ లోతైన విచారణకు వెళ్తున్న సందర్భంలో మూలాలు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లోనే కనిపిస్తుడంటం కొసమెరుపు. గతంలో ప్రభుత్వ భూములకు అసెస్‌మెంట్లు వేసిన విషయంలో పలువురు వ్యక్తులపై ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు కాగా.. వాటికి సంబంధించిన ఇంటినెంబర్లు కేటాయించింది కార్పొరేషన్ అధికారులే. ఆ తర్వాత కాలంలో ఆ తర్వాత 58,59 జీవో ద్వారా అక్రమ క్రమబద్ధీకరణలు జరిగిన విషయం వెలుగులోకి వచ్చిన సందర్భంలోనూ వాటి మూలాలు కూడా దొంగ అసెస్‌మెంట్లే. కాగా తాజాగా పేర్లు మార్చడానికి వీలులేని అసైన్డ్ భూములకు కూడా అసెస్‌మెంట్లు వేసి ఇంటి నెంబర్లు కేటాయించి దర్జాగా హక్కులు కల్పించిన విషయంలోనూ మూలం అక్కడే ఉన్నట్లుగా విజిలెన్స్ అధికారులు విచారణలో గుర్తించారు. అమ్మకాలు, కొనుగోళ్లకు అవకాశం లేని బల్లేపల్లి రెవెన్యూ పరిధిలోని 137, 138సర్వే నెంబర్లలోని అసైన్డ్ భూములకు సంబంధించిన అసలు యజమానులు ఒకరైతే.. ఎలాంటి డాక్యుమెంట్లు లేకుండానే దర్జాగా అసెస్‌మెంట్లు వేసి ఏకంగా యజమాని పేరునే మార్చేశారు ఖమ్మం కార్పొరేషన్ అధికారులు. అలా ముందుగా ఇంటినెంబర్లు పొందిన అక్రమార్కులు.. ఆ నెంబర్ల ద్వారా హక్కులు పొంది, విద్యుత్ మీటర్లను పొందారు. కాగా అసైన్డ్ భూములకు అసెస్‌మెంట్లు వేసి అన్ని సౌకర్యాలు కల్పించిన విషయంపై ముందుగా విద్యుత్ శాఖ నుంచి వివరాలు సేకరించిన అధికారులు, వారిచ్చిన వివరణ ఆధారంగా మిగిలిన ప్రభుత్వ శాఖల నుంచి సైతం నివేదికలు తెప్పించుకున్నట్లు సమాచారం. వాటి ఆధారంగా లోతైన విచారణ చేసిన విజిలెన్స్ అధికారులు వాటికి దొంగ అసెస్‌మెంట్లు వేసినట్లు గుర్తించినట్లు తెలిసింది. అయితే గతంలో సదరు అసైన్డ్ భూములకు అసెస్‌మెంట్లు వేసిన అధికారులు ఇతర ప్రాంతాలకు బదిలీ కాగా.. అంతటిస్థాయిలో ఎలాంటి అనుమతులు లేకుండా బహుళ అంతస్థుల నిర్మాణాలు జరుగుతున్నా పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం ఇక్కడే పనిచేస్తున్నారు.

అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చిన 'ఆంధ్రజ్యోతి'

కార్పొరేషన్‌లో జరుగుతున్న అక్రమాలను ఒక్కొక్కటిగా వెలుగులోకి తీసుకొస్తున్న 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలను ప్రచురిస్తూ వస్తోంది. ఆయా కథనాల్లో 'ఇంటి దొంగల' శీర్షిక మొదలుకుని అ'క్రమబద్ధీకరణ' వరకు పదులకొద్దీ కథనాలను ప్రచురించింది. వాటిల్లో భాగంగా ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని బల్లేపల్లిలోని 137 సర్వే నెంబరులో 62.27 ఎకరాలు, 138 సర్వే నెంబరులో 94.38 ఎకరాల భూమి ఉండగా.. ఎన్నో యేళ్ల క్రితం ఆయా భూములను పేదలకు పంచినట్లు, ఆ అసైన్డ్ భూములకు యజమానుల పేర్లు మీద కాకుండా వేరొకరి పేరుమీద దొంగ అసెస్‌మెంట్లు వేశారన్న విషయాన్ని ఆధారాలతో సహా 'అసైన్డ్ భూములకు ఎసరు' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. ఆయా అసెస్‌మెంట్ల ద్వారా హక్కులు పొందిన అక్రమార్కులు ప్రధాన రహదారుల వెంబడి ఉన్న స్థలాలను కమర్షియల్‌గా మార్చినట్లు, వాటికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, మీటర్లు కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ఎకరానికి పైగా ఉన్న స్థలంలో చేసిన నిర్మాణానికి ఇంటి నెంబర్లు కేటాయించినట్లు స్పష్టం చేసింది. కాగా ఈ కథనం ప్రచురితమైన సమయంలో ఖమ్మం అర్బన్ మండల రెవెన్యూ అధికారులు విచారణ చేసి పీవోటీ నోటీసులు కూడా ఇవ్వగా.. కార్పొరేషన్ అధికారులు అసెస్‌మెంట్లు డీయాక్టివేట్ చేశారు. కానీ ఆ తర్వాత ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కాగా విజిలెన్స్ అధికారులు లోతుగా విచారణ చేపడితే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

గురుకులాల నిర్వహణకు పకడ్బందీ చర్యలు

(5వ పేజీ తరువాయి)

అవసరమైన సౌకర్యాలను ప్రభుత్వం కల్పించిందని వివరించారు. గురుకులాల్లో దోమల బెడద లేకుండా చూడాలని, ప్రత్యేకాధికారులు మెనూ పరీక్షించాలని, టైంటెబుల్ ప్రకారంగా పాఠశాలల్లో మెనూ అమలు జరిగేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. తమ ప్రజా ప్రభుత్వం పాఠశాలల ప్రారంభం నాటికే పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించేందుకు ముందుగానే నిధులు కేటాయించిందని తెలిపారు. హాస్టల్ భవనాలకు కూడా తక్షణ మరమ్మతులు చేయాలని ఆదేశించారు. గురుకులాల పరిసరాల్లో విద్యార్థులకు అవసరమైన పండ్ల మొక్కలను పెంచాలని ఆదేశించారు. ఏటా కోటి మొక్కలు పెంపకం వల్ల రూ.300కోట్లు ఖర్చవుతుందని, మొక్కలను నాటడంతో పాటు అవి పెరుగుతున్నాయా? లేదా ? అనేది పర్యవేక్షించాలని, గత పదేళ్లలో నాటిన మొక్కల వివరాలతో ఓ నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మహిళలకు ఉచిత బస్సు అందించడం ద్వారా బస్సులకు డిమాండ్ పెరిగిందని, అన్ని గ్రామాలకు కొత్త బస్సు సర్వీసులు నడపాలని ఆయన కోరారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గీత కార్మికులకు కాటమయ్య రక్షక కిట్లను పంపిణీ చేయాలని, వనమహోత్సవంలో తాటి, ఈత, ఖర్జూర మొక్కలను నాటాలని అధికారులకు సూచించారు. ప్రజాప్రతినిధులను సంప్రదించి అవసరం ఉన్న ప్రతీ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని సూచించారు. పేద విద్యార్థులకు ఐఐటీ, నీట్‌లలో ప్రావీణ్యం వచ్చేలా శిక్షణ అందించాలని కోరారు. గురుకులాల్లో మంజూరైన సీట్లను పూర్తిస్థాయిలో నింపాలని, గత ప్రభుత్వం తాత్కాలిక భవనాల్లో గురుకులాలను ఏర్పాటు చేసిందని, 327 గురుకులాల్లో కేవలం 26 గురుకులాలకే భవనాలున్నాయని గుర్తుచేశారు. ఈపరిస్థితిని మార్చేందుకు ఇంటర్నేషనల్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జిల్లాకు అవసరమైతే ఎలక్ట్రికల్ బస్సులు అందిస్తామన్నారు. బీసీ సంక్షేమ శాఖ ద్వారా అందే పథకాలు పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు పొందేందుకు శిక్షణ ఇవ్వాలని, హైదరాబాదు వచ్చే అవకాశం లేకుండా అన్ని మెటీరియల్స్ అందించాలన్నారు. ఈ ఏడాది నిర్వహించే వనమహోత్సవం కార్యక్రమంలో 81వేల ఈతమొక్కలు నాటేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని, గీత సొసైటీలను భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు. 15రోజులకోసారి సమీక్ష చేసి మొక్కలు పరిస్థితి పరిశీలించాలని, ప్రభుత్వ ఖాళీశస్థలాల్లో కూడా పెద్ద ఎత్తున మొక్కలు పెంచాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు కారణంగా ఎక్కువ బస్సులు ఏర్పాటుచేయాలని, జిల్లాలకు అదనపు బస్సులు అందిస్తామని ప్రకటించారు. లాండ్రీలు, దోబీ ఘాట్లు, సెలూన్లకు విద్యుత్ సరఫరా అందించాలని తెలిపారు. సమావేశంలో గిడ్డంగులు సంస్థచైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, కలెక్టర్లు అనుదీప్ దురిశెట్టి, జితేష్ వి పాటిల్, మేయర్ నీరజ, అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి జ్యోతి పాల్గొన్నారు.

బాబోయ్.. లీకులు

- మరమ్మతులు చేసినా ఆగని నీరు
- గుంతలమయంగా మధిర క్రాస్‌రోడ్డు
- అదే దారిలో ప్రయాణిస్తున్న ప్రముఖులు



రోడ్డుపై ఏర్పడిన గుంతల్లోంచి వెళ్తున్న వాహనదారులు

వైరా, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన వైరా నడిబొడ్డు ప్రాంతమైన క్రాస్‌రోడ్డుకు రెండువైపులా మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీలు అరికట్టడంలో సంబంధిత అధికారులు పూర్తి వైఫల్యం చెందారు. ఫలితంగా మరమ్మతులు చేసిన మరుక్షణం నుంచే పైపులైన్లు లీకవుతూ మంచినీరు రోడ్డుపైన ప్రవహిస్తూ గుంతలమయంగా తయారైంది. నిత్యం వేలాది వాహనాలు, ప్రజలు రాకపోకలు సాగించే కీలకమైన ఈ క్రాస్‌రోడ్డు నిర్వహణలో మునిసిపల్, ఆర్‌అండ్‌బీ, మిషన్ భగీరథ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వైరాలోని జాతీయ ప్రధాన రహదారి నుంచి మధిర-జగ్గయ్యపేట వెళ్లే రోడ్డు క్రాస్ అవుతుంది. క్రాస్‌రోడ్డుకు ఒకవైపు వైఎస్సార్ విగ్రహం ముందు మిషన్ భగీరథ పైపులైన్ లీకవుతుండగా ఇటీవల మరమ్మతులు చేశారు. అదే క్రమంలో క్రాస్‌రోడ్డు వద్ద ఖమ్మం వైపు వెళ్లే మరోవైపు మలుపులో పైపులైన్ కూడా లీకవుతూ మంచినీరు నిత్యం వృథాగా రోడ్డుపై ప్రవహిస్తుంది. దాంతో ఇక్కడ రోడ్డు మొత్తం గుంతలమయంగా మారి ప్రమాదకరంగా తయారైంది. రెండురోజుల కిందట ఈ పైపులైన్ల లీకేజీకి మరమ్మతులు చేసి మట్టితో పూడ్చివేశారు. కొన్నిగంటల వ్యవధిలోనే తిరిగి మళ్లీ మరమ్మతులు చేసిన చోటే పైపులైన్లు లీకవుతూ తాగునీరు రోడ్డుపైన ప్రవహిస్తోంది. దాంతో ద్విచక్ర, త్రిచక్ర వాహనచోదకులు, పాదచారులు ఈ గుంతల్లోనుంచి రాకపోకలు సాగించటం ఇబ్బందికరంగా మారింది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్రంలోని వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్, తదితర శాఖల అధికారుల వాహనాలు బుధవారం ఈ గుంతల్లోని నీటిలోనుంచే మధిరకు వెళ్లివచ్చాయి. ఇప్పటికైనా ఎంతో కీలకమైన ఈ క్రాస్‌రోడ్డులో పైపులైన్ల లీకులకు మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టాలని, ఈ గుంతలకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



గుంతలమయంగా రోడ్డు



విద్యుత్ కిట్లు పంపిణీ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి, రవాణాశాఖ మంత్రి పొన్నం

నిరంతర విద్యుత్ సరఫరాకు పటిష్ఠ ప్రణాళిక

- 1912కు ఫోన్ చేస్తే అందుబాటులోకి విద్యుత్ అంబులెన్స్‌లు
- ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి, రవాణాశాఖ మంత్రి పొన్నం

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరంతర విద్యుత్ సరఫరాకు పటిష్ఠమైన చర్యలను తీసుకుంటున్నామని, విద్యుత్ అంతరాయం ఏర్పడితే తక్షణ పునరుద్ధరణకు విద్యుత్ అంబులెన్స్‌లు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

బుధవారం ఖమ్మంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని జిల్లాలకు చెందిన విద్యుత్ అంబులెన్స్‌లను రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగులకు ప్రత్యేకంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్‌ను రైతుల నుంచి గృహ, వ్యాపార అవసరాల వరకు అందిస్తున్నామన్నారు. విపత్తులు జరిగిన సమయంలో తక్కువ సమయంలో త్వరగా విద్యుత్ పంపిణీ చేసి విద్యుత్ ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందారని అభినందించారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యుత్‌శాఖలో పారదర్శకత పెరిగిందన్నారు. విద్యుత్ సాంకేతిక సమస్యలు, వాతావరణ విపత్తులు వల్ల విద్యుత్ అంతరాయం ఏర్పడితే 1912 నెంబర్‌కు కాల్ చేస్తే విద్యుత్ అంబులెన్స్‌లు వస్తాయని తెలిపారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యుత్ శాఖలో పనిచేసే లైన్‌మేన్ నుంచి సీఎండీ వరకు రూ.1కోటి బీమాను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. కేటీపీఎస్ స్టేజీ 7వరకు, హైడల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు మొత్తం గత ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటు చేశామన్నారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత నూతన విద్యుత్ పాలసీని తీసుకొచ్చామన్నారు. 2023లో 15వేల మెగా వాట్ల విద్యుత్ డిమాండ్ ఉండగా ఇప్పుడు 17వేల 162మె.వా. డిమాండ్‌కు పెరిగిందన్నారు. అయినా ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా పంపిణీ చేస్తున్నామన్నారు.

రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సామాన్యుల జీవన ప్రమాణాలు పెరిగేందుకు విద్యుత్‌శాఖ పనితీరు కీలకంగా ఉంటుందన్నారు. ఆర్టీసీ కార్మికులకు వర్తింపు జరిగే బీమాను విద్యుత్ శాఖలో అమలు జరుగుతుందని త్వరలో ఇతర ప్రభుత్వశాఖలకు అమలు జరుపుతామన్నారు. టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ గత వర్షాకాలం ఖమ్మం సర్కిల్ పరిధిలో రూ.30 కోట్ల విద్యుత్ నష్టం జరిగిందని అయినా విద్యుత్ సిబ్బంది ఎంతో కష్టపడి వారం రోజుల్లో విద్యుత్ పునరుద్దరణ చేశారని అభినందించారు. మేయర్ పునుకొల్లు నీరజ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఇంచార్జీ డైరెక్టర్‌లు మధుసూదన్, ఆశోక్‌కుమార్, సదన్ లాల్, చీఫ్ ఇంజనీర్ రాజీవ్‌చౌహాన్, ఖమ్మం, వరంగల్ జిల్లా ఎస్‌ఈలు ఇనుగుర్తి శ్రీనివాసాచారి, అల్లబొయిన సురేందర్, ట్రాన్స్‌కో ఎస్‌ఈ శ్రీనివాస్, డీఈలు నంబూరి రామారావు, హీరాలాల్ పాల్గొన్నారు.

ఊరికో బస్సు.. ఇంటికో దీపం

- అదే కాంగ్రెస్ పార్టీ నినాదం
- ఉచిత బస్సు పథకం కోసం ఆర్టీసీకి రూ. 6,210 కోట్లు విడుదల చేశాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ రంగం నిర్వీర్యం
- ప్రజా ప్రభుత్వం లాభాల బాటను పట్టించింది
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



బస్టాండ్ పనులకు శంకుస్థాపన చేస్తున్న భట్టి, పొన్నం

మధిరటౌన్, జూన్18 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ రంగం నిర్వీర్యమైందని, నేటి ప్రజా ప్రభుత్వం నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల బాట పట్టించిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర రవాణశాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పది కోట్ల నిధులతో నిర్మించనున్న మధిర బస్టాండ్ నిర్మాణ పనులకు శంకుస్థాపనతో పాటు 10 బస్సులను బుధవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఊరికోక బస్సు నినాదంతో ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. విద్యుత్ సౌకర్యం లేని ఇల్లు ఉండదని, ఇంటికో దీపం పేరుతో ప్రతి ఇంట్లో విద్యుత్ వెలుగులు వెలిగిస్తామని తెలిపారు. ఆర్టీసీని లాభాల బాట పట్టించడంలో మంత్రి పొన్నం కృషిని భట్టి అభినందించారు. మహిళల కోసం మహాలక్ష్మి పేరుతో ఉచిత బస్సు పథకం పెట్టామని తెలిపారు. ఇప్పటి వరకు 186 కోట్ల జీరో టికెట్లను జారీ చేయగా, 6210 కోట్లు ఆర్థికశాఖ ఆర్టీసీకి చెల్లించామన్నారు. అత్యాధునిక వసతులతో, నాణ్యతా ప్రమాణాలతో బస్టాండ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. బ్యాటరీతో నడిచే 600 బస్సులను మహిళా సంఘాలకు ఇచ్చామని, రాబోయే రోజుల్లో డ్వాక్రా మహిళలకు బ్యాంకు లికేంజి ద్వారా బస్సులను కొనుగోలు చేయించి, వాటిని ఆర్టీసీకి లీజుకు ఇప్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్, సిపి సునీల్‌దత్, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యం, ఆర్టీసి ఆర్ఎం సరిరాం నాయక్, మధిర డిపో మేనేజర్ దేవదానం, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సమీక్షకు రాకుండానే వెనుదిరిగిన వాకిటి

- ఉపముఖ్యమంత్రి భట్టిని కలిసి తిరుగుపయనం
- చర్చనీయాంశమైన ఇన్‌చార్జ్ మంత్రి శ్రీహరి పర్యటన షెడ్యూల్



మంత్రి శ్రీహరికి మిఠాయి తినిపిస్తున్న భట్టి, మంత్రి పొన్నం

ఖమ్మం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా ఇటీవల నియమితులైన పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, యువజన క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి బుధవారం ఖమ్మం కలెక్టరేట్‌లో జరిగే ఉమ్మడి జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారుల సమీక్ష సమావేశానికి హాజరవనున్నట్టు అధికారికంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఖమ్మం వచ్చిన ఆయన సమీక్షకు హాజరుకాకుండా.. ఉముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి హైదరాబాద్ తిరుగుపయనం కావడం చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి రవాణా, బీసీసంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తన శాఖ పరిధిలోని రవాణా, ఎక్సైజ్ తదితర శాఖల పనితీరుపై ఖమ్మం కలెక్టరేట్‌లో సమీక్ష ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి ఇన్‌చార్జ్ మంత్రి హోదాలో వాకిటి శ్రీహరి కూడా తొలిసారి హాజరవుతున్నారని అధికారికంగా షెడ్యూల్ విడుదలైంది. ఈ సమీక్షతో పాటు మధిర నియోజకవర్గంలో జరిగే కార్యక్రమంలో కూడా పాల్గొననున్నట్టు ప్రకటించారు. ఇందులో భాగంగా ఉదయం ఖమ్మం చేరుకున్న ఆయన ఉపముఖ్యమంత్రి భట్టి క్యాంపు కార్యాలయంలో భట్టిని, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ మంత్రిగా తొలిసారి వచ్చిన వాకిటి శ్రీహరికి ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఘన స్వాగతం పలికారు. ఆతర్వాత మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి.. భట్టితో సమావేశమయ్యారు. ఈ క్రమంలో శ్రీహరిని డిప్యూటీ సీఎం సత్కరించి స్వీటు తినిపించారు. అయితే ఇన్‌చార్జ్ మంత్రి హోదాలో జిల్లాకు వచ్చినప్పుడు.. జిల్లాకు చెందిన మరో ఇద్దరు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితోపాటు ఉమ్మడిజిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు,అన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరుకావాల్సి ఉంటుంది. కానీ బుధవారం తలపెట్టిన కార్యక్రమాల్లో వారు లేనందను హాజరుకావడం మంచిది కాదని ఉపముఖ్యమంత్రి భట్టి.. వాకిటి శ్రీహరికి చెప్పినట్టు సమాచారం. దీంతో ఇన్‌చార్జ్ మంత్రి శ్రీహరి మరోసారి జిల్లా మంత్రులందరితో సంప్రదించి సమీక్షపై తేదీ వెల్లడిస్తానని అధికారులకు చెప్పి హైదరాబాదు వెళ్లిపోయారు. అనంతరం ఉపముఖ్యమంత్రి భట్టి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. కలెక్టరేట్‌లో జరిగిన బీసీ సంక్షేమశాఖ సమీక్షలో పాల్గొన్నారు. అయితే జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలు లేకుండా ఇన్‌చార్జ్ మంత్రి సమీక్షకు హాజరవుతున్నట్టు పర్యటన ఖరారు చేయడం చర్చనీయాంశంగా మారింది. అనంతరం ఉపముఖ్యమంత్రి భట్టి, రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కలెక్టరేట్‌లో జరిగిన బీసీసంక్షేమశాఖ సమీక్లలో పాల్గొన్నారు. జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలు లేకుండా ఇన్‌చార్జి మంత్రి హోదాలో సమీక్షకు హాజరవుతున్నట్టు పర్యటన ఖరారు చేయడం, తిరిగి వెళ్లపోవడం చర్చనీయాంశంగా మారింది.



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ నాయకుడు సుబ్బారావు కన్నుమూత

- సంతాపం తెలిపిన హరియాణా గవర్నర్ దత్తాత్రేయ
- అంత్యక్రియల్లో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు, నాయకులు



సుబ్బారావు(ఫైల్)

భద్రాచలం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): భద్రాచలానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు మారెమల్ల సుబ్బారావు(78) మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న సుబ్బారావు బుధవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ సుబ్బారావు మృతికి తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు. సుబ్బారావు జన సంఘ్ కాలం నుంచి సిద్ధాంత నిబద్ధతతో పార్టీ అభ్యున్నతికి కృషి చేశారని, ఎమర్జెన్సీ కాలంలో జైలు జీవితాన్ని గడిపారని దత్తాత్రేయ పేర్కొన్నారు. బీజేపీ సీనియర్ నేత సుబ్బారావు మృతి చెందిన విషయం తెలుసుకొని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కుంజా ధర్మా, ఇతర నాయకులు ఆయన పార్థీవ దేహాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సుబ్బారావుకు అంత్యక్రియల్లో వారు పాల్గొన్నారు. వారితో పాటు జిల్లా నాయకులు పసుమర్తి సతీష్, నడిదవోలు నాగబాబు, ములిశెట్టి రామ్మోహన్‌రావు, ఆవుల సుబ్బారావు, పీసీ కేశవ్, కుంజా సంతోష్, వెంకన్న, బోడా సత్యనారాయణ, పాండురంగాచారి, సాయి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగ్గురికి ఎస్సైలుగా ఉద్యోగోన్నతి

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో ఏఎస్సైలుగా విధులు నిర్వహిస్తున్న ముగ్గురికి ఎస్సైలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ పోలీసు ఉన్నతాధికారులు బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ఖమ్మం జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లలో ఏఎస్సైలుగా విధులు నిర్వహిస్తున్న ఎం.సూర్యనారాయణ, ఎం. కమలాష బేగ్, వీఆర్ రాఘవయ్యకు ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి ఇస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

పోలీసుల అదుపులో పోకిరీ

- మఫ్టీలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న షీటీం ఎస్ఐ

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్18(ఆంధ్రజ్యోతి): గత రెండు నెలలుగా ఓ యువతిని వేధిస్తున్న పోకిరీని షీ టీం బృందం అదుపులోకి తీసుకున్న సంఘటన కొత్తగూడెం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. కొత్తగూడెం టూటౌన్ పరిధిలోని రామవరం మాతా శిశు ఆరోగ్య కేంద్రం వద్ద ఉన్న ఆర్టీసీ బస్టాప్ దగ్గర ఒక యువతనికి రోజూ ఓ వ్యక్తి వేధిస్తున్నాడు. ఆ యువతి భయాందోళన చెంది చేసేదేమి లేక భద్రాద్రి షీ టీంను సంప్రదించింది. పక్కా సమాచారంతో షీ టీం ఎస్ఐ రమాదేవి మఫ్టీలో వెళ్లి బస్టాప్ వద్ద ఆ వ్యక్తిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని అదుపులోకి తీసుకున్నారు. ఆ వ్యక్తిని కొత్తగూడెం టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించి జరిగిన సంఘటన సీఐ ప్రతాప్‌కు పూర్తి వివరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమాదేవి మాట్లాడుతూ మహిళలను ఎవరైనా వేధిస్తున్నారని తెలిస్తే షీ టీం బృందం అక్కడ చేరుకొని వారిని గుర్తించి అదుపులోకి తీసుకుంటామని తెలిపారు. వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకునేందుకు పోలీస్ స్టేషన్‌కు తరలిస్తామన్నారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టంచేశారు.

రైలు నుంచి పడి ఒడిసా వాసి మృతి

బోనకల్, జూన్18 (ఆంధ్రజ్యోతి): బోనకల్ సబ్‌స్టేషన్ సమీపంలో గల రైల్వే ట్రాక్ వద్ద బుధవారం రైలు నుంచి జారిపడటంతో ఒడిసావాసి మృతి చెందాడు. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. రైల్వే ట్రాక్ పనులు చేస్తున్న సిబ్బంది సమాచారాన్ని పోలీసులకు, 108 వాహనానికి ఇచ్చారు. అప్పటికే మృతిచెంది ఉన్నాడని నిర్ధారించారు. మృతుడి జేబులో ఉన్న ఆధార్ కార్డు ప్రకారం అతడు ఒడిసా రాష్ట్రానికి చెందిన బిశ్వంత్ మహంతిగా గుర్తించారు. మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అన్నం శ్రీనివాసరావు వాహనం ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రైల్వే జీఆర్‌పీ ఎస్ఐ భాస్కర్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

తల్లాడ, జూన్18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగాపురం వద్ద బుధవారం ద్విచక్రవాహనం అదుపుతప్పి పల్టీకొట్టడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న వేంసూరు మండలం గూడూరు గ్రామానికి చెందిన కంటే శేఖర్‌గౌడ్‌కు తీవ్రగాయాలయ్యాయి.



అవార్డు అందుకున్న బాలనటి హారికను అభినందిస్తున్న యువదర్శకుడు వెంకటరమణ

మెప్పించిన 'మెర్సీ కిల్లింగ్'

- బాల నటికి గద్దర్ అవార్డు రాకతో వెలుగులోకి యువదర్శకుడి ప్రతిభ
- తొలిచిత్రంతోనే డైరెక్షన్‌లో సత్తా చాటిన వల్లభి వాసి వెంకటరమణ

ముదిగొండ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): యువ దర్శకుడిగా సినీ పరిశ్రమలో రాణిస్తున్న ఖమ్మంజిల్లా ముదిగొండ మండలం వల్లభి గ్రామానికి చెందిన సూరపల్లి వెంకటరమణ తాను దర్శకత్వం వహించిన సినిమాకు గద్దర్ అవార్డు లభించింది. తెలంగాణ ప్రభుత్వం తొలిసారిగా గద్దర్ ఫిలిం అవార్డులను ప్రకటించింది. రమణ దర్శకత్వం వహించిన 'మెర్సీ కిల్లింగ్' అనే సినిమాలో నటించిన హారికకు గద్దర్ అవార్డును ప్రభుత్వం అందజేసింది. యువ దర్శకుడు సూరపల్లి వెంకటరమణ వల్లభి గ్రామంలో జన్మించి ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి వరకు విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. అనంతరం సినీరంగంపై మక్కువతో ఫిలింనగర్‌లో వివిధ విభాగాల్లో పనిచేసి మూడు సినిమాలకు దర్శకత్వం వహించి 20సినిమాల వరకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. తాను దర్శకత్వం వహించిన మూడో సినిమా మెర్సీ కిల్లింగ్ సినిమా హిట్ కావడంతో ఈ సినిమాలో నటించిన బాలనటి హారిక గద్దర్ అవార్డు అందుకుంది. మెర్సీ కిల్లింగ్ సినిమాలో సాయికుమార్, పార్వతీశం, ఐశ్వర్య, బాలనటి హారిక ప్రధాన పాత్రలో నటించి ప్రేక్షకులను మెప్పించారు. తమ గ్రామానికి చెందిన యువదర్శకుడు వెంకటరమణ సినీరంగంలో రాణించటం పట్ల గ్రామస్థులు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

కేఎంసీలో మెప్మా ఉద్యోగికి బెదిరింపులు

ఖమ్మం కార్పొరేషన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్ వ్యవస్థ నుంచి మెప్మా ద్వారా నేరుగా వేతనాలు చెల్లింపులతో ఖమ్మం నగర పాలక సంస్థలోని కీపింగ్ కార్మికుల వేతనాలు గణనీయంగా పెరిగాయి. దీంతో స్వీపింగ్ కార్మికుల ఉద్యోగాలకు డిమాండ్ పెరిగింది. అవసరానికి మించి కార్పొరేటర్ల సిఫారసులతో నేరుగా ఉద్యోగంలో చేరిన కార్మికులు వీఐపీ కార్మికులుగా మారుతున్నారు. మెప్మా సిబ్బంది చెప్పిన ప్రాంతంలో విధులు చేయడం లేదు. అంతేకాకుండా చివరకు మెప్మా ఆర్పీలను బెదిరించే స్థాయికి చేరారు. ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో పారిశుధ్య పనులు చేసేందుకు సోమవారం ఓ కార్పొరేటర్ సిఫారసు మేరకు రమా అనే మహిళ ఉద్యోగంలో చేరింది. మెప్మా సిబ్బంది ఆమెకు పార్కింగ్‌లో విధులు కేటాయించారు. అయితే తాను పార్కింగ్‌లో డ్యూటీ చేయటం ఏంటనీ మరుసటి రోజు మంగళవారం కేఎంసీ కార్యాలయానికి ప్రస్తుతం కేఎంసీలో డ్రైవర్‌గా పనిచేస్తున్న వ్యక్తిని పిలిపించింది. మద్యం మత్తులో ఉన్న ఆ వ్యకి నేరుగా విధుల్లో ఉన్న మెప్మా ఆర్పీ వద్దకు వచ్చి తనకు చెందిన మహిళకు పార్కింగ్‌లో ఎలా డ్యూటీలు వేస్తారని, నీ సంగతి చూస్తా అంటూ బెదిరించాడు. అనుకోని సంఘటన ఈ ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో చర్చనీయాంశంగా మారింది. కాగా ఇటీవల కార్పొరేటర్ల సిఫారసులతో కేఎంసీలో చేరిన కార్మికులు తమకు నచ్చిన పనులే చేస్తామంటూ భీష్మించుకూర్చుంటున్నారు. బెదిరింపులకు పాల్పడుతున్నారు. కాగా బాధిత ఆర్పీ మెప్మా అధికారులకు ఫిర్యాదు చేశారు.

గంజాయి విక్రయదారుల అరెస్ట్

ఖమ్మం రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఒడిసా రాష్ట్రం నుంచి గంజాయి తీసుకువచ్చి ఖమ్మంలో విక్రయిస్తున్న ముఠా సభ్యులను బుదవారం ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సంకర రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రూరల్ మండలం, కరుణగిరి వద్ద గల టీఎన్జీవోస్ కాలనీకి చెందిన రవితేజ, పాకబండ బజార్‌కు చెందిన షేక్ జిలాన్ సైఫ్, సంభాని నగర్‌కు చెందిన షేక్ మహమ్మద్ పాషా, తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామానికి చెందిన గోపీ, శ్రీకాంత్, సందీప్ అనే ఆరుగురు వ్యక్తులు కలిసి రెండు ద్విచక్రవాహనాల మీద ఒడిసా రాష్ట్రంలోని మల్కనగిరి నుంచి గంజాయి తీసుకువచ్చారు. కరుణగిరి బైపాస్ రోడ్డు ప్రాంతంలో పలువురికి విక్రయిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న గంజాయి విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందన్నారు. ఆరుగురిలో ఒకరు పరారుకాగా మిగిలిన వారిని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించినట్లు తెలిపారు. నాలుగు బైక్‌లు, ఐదు సెల్‌ఫోన్‌లు, స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్ఐ శ్రీహరిరావు, సిబ్బంది కరీం, బాలు, సుధీర్, వెంకటేష్, హనుమంతరావు, విజయ్, హరీష్, వీరబాబు పాల్గొన్నారు.

చెక్‌డ్యాంలో పడి వ్యక్తి కన్నుమూత

జూలూరుపాడు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెక్‌డ్యాంలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలోని వెంగన్నపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. మండలంలోని వెంగన్నపాలెం గ్రామానికి చెందిన చెంగల చిన్న వెంకయ్య(55) మతిస్థిమితం కోల్పోయి మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. మంగళవారం సాయంత్రం ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి అయినప్పటికి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో బంధువులు, కుటుంబ సభ్యులు అతడి ఆచూకి కోసం వెతికారు. అయినప్పటికి కనిపించలేదు. వెంగన్నపాలెంలోని వైకుంఠదామ సమీపంలో ఉన్న చెక్‌డ్యాంలో వెంకయ్య పడి ఉండటాన్ని గుర్తించిన గ్రామస్థులు అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

చికిత్స పొందుతూ యువకుడు..

టేకులపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని స్టేషన్‌తడికలపూడిలో జరిగింది. మండలంలోని స్టేషన్‌తడికలపూడి గ్రామానికి చెందిన గుగులోతు భద్రు కుమారుడు గుగులోతు తరుణ్(20) పదేళ్ల క్రితం కింద పడటం వల్ల అప్పుడప్పుడు మతిస్థిమితం కోల్పోతుంటాడు. ఈ క్రమంలో సోమవారం మతిస్థిమితం లేమితో ఇంట్లో మిగిలిఉన్న పురుగుల మందును సేవించాడు. కుటుంబసభ్యులు కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

సింగరేణికి ఐసీఎంఏఐ పురస్కారం

- సీఎండీ బలరాం హర్షం

కొత్తగూడెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సింగరేణి అవలంబిస్తున్న వ్యయ నియంత్రణ చర్యలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. దేశంలో పార్లమెంట్ చట్టం కింద ఏర్పడిన చట్టబద్ధ ప్రతిష్ఠాత్మక సంస్థ అయిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఎంఏఐ) యేటా ప్రదానం చేసే జాతీయస్థాయి పురస్కారానికి సింగరేణి ఎంపికైంది. సింగరేణి అనుసరిస్తున్న వ్యయ నియంత్రణను ప్రశంసిస్తూ మెగా పరిశ్రమల విభాగంలో ఐసీఎంఏఐ తృతీయ బహుమతికి ఎంపిక చేసినట్లు ఐసీఎంఏఐ పేర్కొంది. 2024 సంవత్సరానికి గాను నేషనల్ అవార్డు ఫర్ ఎక్సలెన్స్ ఇన్ కాస్ట్ మేనేజ్‌మెంట్‌లో తృతీయ బహుమతికి సింగరేణిని ఎంపిక చేసినట్లు ఐసీఎంఏఐ అధ్యక్షుడు ఎంప భిభూతి భూషణ్ నాయక్ పేర్కొన్నారు. ఈ నెల 23వ తేదీన సాయంత్రం ఢిల్లీలోని విజ్ఞాన భవన్‌లో బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. అదే రోజు ఉదయం విజ్ఞాన భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా పాల్గొనే 12వ జాతీయ విద్యార్థుల స్నాతకోత్సవంలో బహుమతి గ్రహీతలు కూడా పాల్గొనాల్సిందిగా కోరారు.

డంపింగ్ యార్డులో అగ్గి

భద్రాచలం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం గోదావరి కరకట్ట వద్ద ఉన్న పాత డంపింగ్ యార్డులో బుధవారం తెల్లవారుజాము నుంచి అగ్గి రాజుకుంది. దీంతో దట్టమైన పొగలు, దుర్వాసన సమీపంలోని అంబాసత్రం, చప్టా దిగువ, రాజవీధిలకు వ్యాపించాయి. దీంతో సమాచారం అందుకున్న భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ చొరవతో సమస్యకు పరిష్కారం లభించింది. పీవో, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు కరకట్ట డంపింగ్ యార్డును పరిశీలించారు. ఫైరింజన్, పంచాయతీ నీటి ట్యాంకర్ల సహాయంతో మంటలను ఆర్పివేశారు. 70 అడుగుల మేర చెత్త పేరుకుపోవడంతో కింది భాగం నుంచి మంటలు రాజుకున్నట్లు తెలిసింది.



ఆదివాసీ మహిళకు కార్డును అందజేస్తున్న పీవో రాహుల్

'దర్తీ అబా అభియాన్' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్

బూర్గంపాడు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మారుమూల ఆదివాసి గిరిజన గ్రామాలలో నివసించే గిరిజన కుటుంబాల సౌకర్యార్థం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా కలిసి 'దర్తీ అబా జన్ జాతీయ ఉత్కర్ష్ అభియాన్' అనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టాయని, దాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. బుధవారం బూర్గంపాడు మండల పరిధిలోని కృష్ణసాగర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన దర్తీ అబా అభియాన్ గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన పీవోకు గ్రామస్థులు గిరిజన సంప్రదాయం ప్రకారం కొమ్ము నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. గ్రామసభకు వచ్చిన గిరిజనులకు గ్రామసభలో అధికారులు చేపడుతున్న కార్యాచరణ, గిరిజనులకు అందిస్తున్న వివిధ రకాల కార్డుల గురించి వారికి వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం కొత్తగూడెం ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనుల సౌకర్యార్థం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని, జిల్లాలో ఏజెన్సీ ఏరియాలో 130గ్రామ పంచాయతీలను ఎంపిక చేశామన్నారు. వీటిలో కృష్ణసాగర్ కూడా ఉందని అన్నారు.

అనంతరం అదే గ్రామంలోని గురుకుల బాలుర కళాశాలను పీవో సందర్శించారు. కళాశాలలోని తరగతి గదులు, డార్మెటరీ, వంటగది పరసరాలు, స్టోర్ రూమ్ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ కళాశాలలో వసతి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. గిరిజన సంక్షేమ శాఖ గురుకులం కళాశాలలు ప్రారంభమైనందున విద్యార్థులు చదువు మానివేయవద్దని అన్నారు. అందరూ కళాశాలలకు వచ్చే విధంగా ప్రిన్సిపాల్, అధ్యాపకులు శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. కొత్తమెనూ ప్రకారం సమయానుకులంగా పౌష్టికరమైన ఆహారాన్ని అందించాలని అన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండి వారికి సలహాలు సూచనలు ఇస్తూ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏంపీవో బాలయ్య, ఏంఎవో కృష్ణయ్య, ఏవోశంకర్, ఏపీవో విజయలక్ష్మి, ఆర్ఐ నరసింహరావు, ఏపీఎం నాగార్జున, బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ లక్ష్మణ్, మీసేవ

5 కిలోల కణితి తొలగింపు



కణితిని బయటకుతీసిన వైద్యులు

భద్రాచలం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో వైద్యులు ఓ మహిళ అండాశయం నుంచి ఐదు కిలోల కణితిని తొలగించారు. బూర్గంపాడు మండలం పినపాక పట్టీనగర్ గ్రామానికి చెందిన ఉండేటి వినోద అనే మహిళ తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతూ వైద్యశాలలో చేరారు. పరీక్షించిన వైద్యులు ఆమెకు బుధవారం ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ ఎం.రామకృష్ణ ఆధ్వర్యంలో వైద్యుల బృందం శస్త్ర చికిత్స నిర్వహించి కణితిని తొలగించారు. ఈ శస్త్ర చికిత్సను ఆరోగ్యశ్రీ కింద నిర్వహించామని, ప్రైవేటు ఆస్పత్రిలో చేయాలంటే రూ.లక్ష వరకు ఖర్చవుతుందని వైద్యులు వెల్లడించారు. శస్త్ర నిర్వహించిన వారిలో వైద్యులు కె.వెంకట్, సాత్విక, షంషాద్ ప్రమీలరాణి, ఆనస్తీషియా వైద్యులు మల్లేష్, నికిత, కౌండ్యా, లతీఫ్ ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిపై సీఎంకు ఎమ్మెల్యే వినతి



మణుగూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పినపాక నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, నియోజకవర్గ ప్రజా సమస్యలను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి సమస్యలను పరిష్కారాన్ని చూపాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి: సీఐ

అశ్వారావుపేట రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఒక లక్ష్యాన్ని నిర్ధేశించుకుని చదువులు సాగించాలని, ఇతరులకు సేవచేసే గుణాలను తప్పకుండా అలవర్చుకోవాలని సీఐ నాగరాజు అన్నారు. మండలంలోని నందిపాడు పాఠశాలలో వాసవి క్లబ్ జోన్ ఛైర్‌పర్సన్ శీమకుర్తి సుబ్బారావు బుధవారం విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు. తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం 120మంది విద్యార్థులకు వీటిని అందించారు. సీఐ నాగరాజు చేతుల మీదుగా చిన్నారులకు ప్లేట్లు పంపిణీ చేశారు. హెచ్‌ఎం కృష్ణారావు, వాసవిక్లబ్ అధ్యక్షులు బాలగంగాధరరరావు, గ్రామపెద్దలు కారం వీరాస్వామి, ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా ప్రతాప్ బాధ్యతల స్వీకరణ

కరకగూడెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కరకగూడెం తహసీల్దార్‌గా గంటా ప్రతాప్ బాధ్యతలు స్వీకరించాడు. ఇంతకు ముందు ఇక్కడ పనిచేసిన నాగప్రసాద్ ఖమ్మం జిల్లా పెనుబల్లికి బదిలీపై వెళ్లారు. అక్కడ పనిచేస్తున్న ప్రతాప్‌ను కరకగూడెం తహసీల్దార్‌గా నియమించారు. అయితే ఆయన అప్పటికే సెలవుల్లో ఉండటంతో ఇన్‌చార్జ్‌గా డీటీ కాంతయ్యకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే సెలవులు ముగించుకొని వచ్చిన ప్రతాప్ బుధవారం తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటితో భూ భారతి కార్యక్రమం ముగిస్తుందని రైతులు కన్నాయిగూడెం పంచాయతీలో జరిగే భూ భారతి కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీ కాంతయ్య, ఆర్ఐ కృష్ణ ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

యువతి వివాహానికి ఆర్థికసాయం

రుద్రంపూర్, (సింగరేణి) జూన్ (ఆంధ్రజ్యోతి) 18: సింగరేణి ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు పేదింటి అమ్మాయి వివాహానికి చేయూతను ఇచ్చారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు అవుతున్న ఉద్యోగులు కొత్తగూడెం ఏరియా వర్క్‌షాపునకు చెందిన ఉద్యోగులు రూ.17వేలను నగదును సేకరించి బుధవారం అమ్మాయి కుదటుంబ సభ్యులకు నగదును కుటుంబసభ్యులకు నగదును అందజేశారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి సింగరేణి అధికారులు చేయూతను అందించడం పట్ల పలువురు హర్షం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏరియా వర్క్‌షాపు డీజీఎం శ్రీకాంత్, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు ఎండి. రజాక్, ఇంజనీర్లు శంకర్, అనీల్, ఉపేందర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై దృష్టి సారించాలి: ఎంపీడీవో

జూలూరుపాడు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీల సౌకర్యాన్ని కల్పిస్తుందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యాన పంటలు సాగుచేసే రైతులకు ప్రభుత్వం ఉచితంగా మొక్కలను పంపిణీ చేయటంతో పాటు మెయింటెనెన్స్‌ను అందిస్తుందని రైతులు ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో ఈజీఎస్ మండల ఏపీఓ రవి, ఎంపీఓ తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సభ్యుల సమస్యలు పరిష్కరించాలి

కొత్తగూడెం, జూన్ 18 (ఆంధ్రోజ్యోతి): కొత్తగూడెం పట్టణంలో నెలకొన్న డ్వాక్రా గ్రూప్ సభ్యుల సమస్యలు పరిష్కరించాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళ సంఘం జిల్లా కార్యదర్శి మండలపు జ్యోతి డిమాండ్ చేశారు. బుధవారం కొత్తగూడెం పట్టణ కమిటీ సమావేశం వెంకటేశ్వరకాలనీలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. డ్వాక్రా గ్రూపుల్లో అనేక రకాల సమస్యలు ఉన్నాయని గతంలో అభయహస్తం పెన్షన్లు ఇస్తామని మాటలు చెప్పి ప్రతి ఒక్కసభ్యురాలు నుంచి సంవత్సరానికి రూ.400చొప్పున కట్టించుకున్నారన్నారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి సందకూరి లక్ష్మి, మచ్చ రమా, శ్యామల, రమ, రాజ్యలక్ష్మి, సువర్ణ, రామ కోటమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

దుమ్ముగూడెం జూన్ 18 (ఆంధ్రజ్యోతి):కె.రేగుబల్లి, ఏకలవ్య, లక్ష్మీనగరం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులకు బుధవారం పారా లీగల్ వలంటీర్లు పిలకా వెంకటరమణారెడ్డి, జి.రమేష్‌లు చట్టాలపై అవగాహన కల్పించారు. పద్నాలుగు ఏళ్లలోపు పిల్లల్ని దుకాణాల్లో పనిలో పెట్టకూడదని, బాలికలకు 18 ఏళ్లు, బాలురకు 21 ఏళ్లు నిండేవరకు వివాహం చేయకూడదని, మధ్యలో చదువు మానేసిన విద్యార్థులను తిరిగి బడికి పంపాలని తెలిపారు.

సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో వైద్య శిబిరం

మణుగూరు రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దమ్మక్కపేటలో బుధవారం సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పద్మ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించిన మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ.. ప్రజలు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వ్యక్తిగత పరిశుభ్రత తప్పక పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

పినపాక, 18 జూన్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోగ్గూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 'మాతృ అభయ ఫౌండేషన్' ఆధ్వర్యంలో బుధవారం నోట్ పుస్తకాలు, మెటీరియల్ అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏడూళ్ల బయ్యారం ఎస్ఐ రాజ్‌కుమార్ హాజరై 40 మంది విద్యార్థులకు నోట్ బుక్స్, మెటీరియల్ అందించారు. కార్యక్రమంలో మాతృ అభయ ఫౌండేషన్ నిర్వాహకులు రామటెంకి రమేష్, ఫౌండేషన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిట్టిమల్ల సతీష్‌చారి, సురేష్, పూనెం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఇందిరమ్మ ఇళ్ల పత్రాల పంపిణీ

చుంచుపల్లి, జూన్18(ఆంధ్రజ్యోతి): చుంచుపల్లి మండల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం గురువారం మధ్యాహ్నం 3:30 గంటలకు ఎన్‌.కె.నగర్‌లోని కొత్తగూడెం కమ్మవారి కళ్యాణ మండపంలో చేపట్టినట్లు ఎంపీడీవో సుభాషిణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పంపిణీకి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలియజేశారు. లబ్దిదారులు సకాలంలో సభా ప్రాంగణానికి చేరుకోవాల్సిందిగా ఎంపీడీవో కోరారు.

ఘనంగా లక్ష తులసి అర్చన పూజలు



కొత్తగూడెం సాంస్కృతికం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడెం విద్యానగర్‌లోని శ్రీ పద్మావతి గోదాసమేత కళ్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం శ్రీనివాసుడికి లక్ష తులసి దళాలతో అర్చన పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుఝామున శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి పంచామృత అభిషేకాలు, విశేష పూల అలంకరణ చేశారు. పూజా కార్యక్రమంలో కొత్తగూ డెం, చుంచుపల్లి ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. గురువారం ఆలయకమిటి ఆధ్వర్యంలో మహా అన్నదాన (నారాయణసేవ) కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ముమ్మరంగా రోడ్డు విస్తరణ పనులు

» బ్రిడ్జినిర్మాణంపై సందేహాలు



మరో బ్రిడ్జి నిర్మించాల్సిన ప్రాంతం ఇదే

మణుగూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మణుగూరు పట్టణంలోని ప్రధాన రహదారి విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. గతంలో పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ ఎక్స్ఛేంజ్ కార్యాలయం వరకు విస్తరించబడిన ఈ ప్రధాన రహదారి ప్రస్తుతం మణుగూరు 100 పడకల ఆసుపత్రి వరకు విస్తరిస్తున్నారు. ప్రధాన రహదారికి ఇరువైపులా రోడ్డు విస్తరణలతో పాటు రెండు వైపులా సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులు చేపడుతున్నారు. దాదాపు రెండు కోట్ల రూపాయాల తో ఈ పనులు జరుగుతున్నట్లు ఆర్అండ్‌బీ అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం రోడ్డు మధ్యన డివైడర్ల ఏర్పాట్లు పనులు పూర్తి కావస్తున్నాయి. కాగా రోడ్డు పనులు కోసం చేసిన తవ్వకాలు, వేసిన కంకర జీఎస్‌పి వల్ల వాహనాల రాకపోకలకు దుమ్ము ధూళి ఎగసి వాహన చోదకులకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొంటున్నాయి.

ఎన్నో ప్రశ్నలు ఉత్పన్నం

మణుగూరు పట్టణ ప్రాంతంలో ప్రధాన రహదారిపై జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో కోడి పుంజుల వాగుపై గతంలో బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టారు. నాడు కేవలం సింగిల్ రోడ్డు ఉన్న ప్రధాన రహదారి డబుల్ రోడ్డుగా విస్తరణలు చేపట్టడంతో నాడు ఇక్కడ కొత్త బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. మరో వైపు కూడా విస్తరణలు జరిగే రోడ్డుకు మరో బ్రిడ్జిని నిర్మించాల్సి ఉంది. రోడ్డు విస్తరణ పనులు ఆసుపత్రి వద్ద కోడిపుంజుల వాగుకు ఇరువైపులా జరుగుతుండగా స్దానిక ప్రజల నుంచి రెండో బ్రిడ్జి ఏర్పాటు పై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. బ్రిడ్జి నిర్మానాలు చేపట్టకుండా రోడ్డు విస్తరణ పనులు చేస్తున్నారు. ఎప్పటికి ఈ బ్రిడ్జి నిర్మానాలు చేపడతారో అని ప్రశ్నిస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం

ఈ విషయంపై ఆర్అండ్‌బీ ఏఈ సురేష్‌ను వివరణ కొరగా బ్రిడ్జి నిర్మాణ విషయంలో తమ శాఖ ఉన్నతాధికారులు ప్రతిపాధనలు పంపించారని తెలిపారు.

'స్థానిక' ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా

జూలూరుపాడు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ప్రజలకు ఎన్నో హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నర గడిచినప్పటికి హామీలను నెరవేర్చకుండా మోసగించిందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించి బుద్ధి చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం జూలూరుపాడులోని సీపీఎం కార్యలయంలో ఏర్పాటుచేసిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పిల్లకాల్వలను ఏర్పాటుచేసి గ్రామాలలోని రైతుల పొలాలకు సీతారామ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలను అందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మంత్రులు తమ స్వార్థం కోసం జిల్లాలోని వ్యవసాయ రంగాన్ని దిగజార్చి రైతులను ఇబ్బంది పెట్టవద్దన్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్, నాయకులు వల్లమల చందర్‌రావు, పద్దం సుగుణ, గడిదేశి కనకరత్నం, ఊడల వెంకటేశ్వర్లు, గోవింద్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు

పేదల హక్కుల కోసం పోరాడేది కమ్యూనిస్టులే: సీపీఐ

మణుగూరు టౌన్/మణుగూరు రూరల్/అశ్వారావుపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పేదల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న సీపీఐకి ప్రజలు అండగా నిలవాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బీ అయోధ్య అన్నారు. మణుగూరు పట్టణంలోని రిక్షా కాలనీ, బాపూజీ నగర్, రామానుజవరం ప్రాంతాల్లో జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కార్మికులు కర్షకులు వ్యవసాయ కూలీలురైతు పక్షాన 100 వందేళ్ల నుంచి సీపీఐ పోరాటాలు చేస్తోందని తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 26ల పట్టణంలో జరగనున్న పార్టీ మండల మహా సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి, మున్నాలక్ష్మి కుమారి, జంగం మోహన్ రావు, గడ్డం వెంకటేశ్వర్లు, కొత్తపల్లి సీతారాములు, కణితి సత్యానారాయణ, వేల్పుల నరేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిక్షా కాలనీ గ్రామ శాఖ నూతన కమిటీనిఎన్నుకున్నారు. రిక్షా కాలనీ కార్యదర్శిగా రవి, బాపూజీ నగర్ కార్యదర్శిగా వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. మండలంలోని రామానుజవరం పాతూరు శాఖలో నూతన కమిటీ సభ్యులుగా నియమించారు. నోముల రవి శాఖ కార్యదర్శి, గుండగని లక్ష్మణరావు సహాయ కార్యదర్శి, బొల్లమ్ చిన్న మదార్‌ను ఎన్నుకున్నారు.

పార్టీ పటిష్టత కోసం పాటుపడాలి

అశ్వారావుపేట,(ఆంధ్రజ్యోతి): పార్టీని ప్రజలలోకి తీసుకెళ్లి, సభ్యత్వాలను పెంచడం ద్వార పార్టీ పటిష్టకోసం ప్రతి ఒక్క సభ్యుడు పాటుపడాలని సీపీఐ జిల్లా నాయకులు సయ్యద్ సలీం పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో మునిసిపాలిటీ స్థాయి సీపీఐ సమావేశం జరిగిది. మండల ఇన్‌చార్జ్ గన్నిన రామకృష్ణ, ఏఐటీయూసీ మండల కార్యదర్శి పటాన్ జలాల్, సీపీఐ పట్టణ కార్యదర్శి విజయ్‌కాంత్, పట్టణ సహాయ కార్యదర్శి సయ్యద్ జాకీర్, చల్లా రమాదేవి, సత్యావతి, రోహిణి, పిల్లి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల నియంత్రణకు చర్యలు

అశ్వారావుపేట రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలో జ్వరాల తీవ్రత రోజురోజుకు పెరుగుతుండటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైద్యశాఖ సిబ్బంది ముమ్మరంగా చర్యలు చేపట్టారు. నిత్యం వైద్యశిబిరాలు, దోమల నివారణ కార్యక్రమాలను చేపడుతున్నారు. జ్వరాల నియంత్రణలో భాగంగా బుధవారం మండలంలోని అత్యంత మారుమూల గ్రామం మొద్దులమడ సమీపంలో కొండపైన గల పెద్దమిద్దేతో పాటు మొద్దులమడలో దోమల నివారణ మందు పిచికారిని చేపట్టారు. పెద్దమిద్దెలో ప్రత్యేకంగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. గొత్తికోయలకు వైద్యులు రాందాస్ నాయక్ వివిధ రకాల పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేశ్, సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు, ఎంటీఎస్ విజయ్‌రెడ్డి, హెల్త్‌అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

29న సీపీఐ పట్టణ మహాసభ

ఇల్లెందు టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): 24 ఏరియా సింగరేణి కమ్యూనిటి హాలులో ఈ నెల 29న ఇల్లెందు నిర్వహించనున్న సీపీఐ పట్టణ మహాసభను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు మిర్యాల రంగయ్య, కే. సారయ్య పిలుపునిచ్చారు. ఇల్లెందు పట్టణంలోని విఠల్‌రావు భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో జిల్లా కార్యవర్గసభ్యులు దేవరకొండ శంకర్, పట్టణ కార్యదర్శి బంధం నాగయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ హరీష్‌గౌడ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బాస శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ రవీందర్, బొల్లి కొమరయ్య సదానందం, సీపీఐ మహిళ నాయకురాలు చంద్రకళ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో సామూహిక అక్షరాభ్యాసాలు

అశ్వారావుపేట రూరల్/టేకులపల్లి జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మిగూడెం సెక్టార్ పరిధిలోని గంగారం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అమ్మమాట అంగన్‌వాడీ బాటలో భాగంగా పలు కార్యక్రమాలను నిర్వహించారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు జరిపారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు ఘనంగా జరిపారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ తులసిరత్నం, ఆశాకార్యకర్తలు, ఇతర సిబ్బంది, తల్లులు పాల్గొన్నారు.

టేకులపల్లి(ఆంధ్రజ్యోతి): మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని ఐసీడీఎస్ టేకులపల్లి సీడీపీవో మంగతార కోరారు. బుధవారం బిల్లుడుతండాలో చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. కార్యక్రమంలో బొమ్మనపల్లి సెక్టారు సూపర్‌వైజర్ యశోదమ్మ, అంగన్‌వాడీ టీచర్లు సరోజా, అమ్మి, పాల్గొన్నారు.

ఏఐటీయూసీ పిట్ కమిటీ నియామకం

రుద్రంపూర్, (సింగరేణి) జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కొత్తగూడెం ఏరియా సివిల్ డిపార్టుమెంట్ ఏఐటీయూసీ నూతన పిట్ కమిటీని ఎంపిక చేసినట్లు బ్రాంచి కార్యదర్శి మల్లికార్జున్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరస్వామిలు తెలిపారు. బుధవారం సివిల్ ఏజీఎం రామకృష్ణను నూతన కమిటీ ప్రతినిధులు కలిశారు. కమిటి వివరాలను బ్రాంచి కార్యదర్శి ప్రకటించారు. పిట్‌కమిటీ కార్యదర్శి సందెబోయిన శ్రీనివాస్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శులు అప్పారావు, వెంకటేశ్వర్లు, జాయింట్ కార్యదరిగా ఎం. శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ప్రకాష్, శివకుమార్‌లను ఎంపిక చేసినట్లు బ్రాంచి కార్యదర్శి ప్రకటించారు.

21 నుంచి రాష్ట్రమహాసభలు

కొత్తగూడెం టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌లో ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించే టీయూసీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా సహాయ కార్యదర్శి సతీష్ కోరారు. బుధవారం కొత్తగూడెం సమావేశం జరిగింది.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

అశ్వారావుపేట రూరల్/ఇల్లెందు రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే వివిధ రకాల పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని మద్దికొండ పంచాయతీలో బుధవారం ధర్తి అబా అభియాన్‌లో భాగంగా గ్రామసభను నిర్వహించారు. గ్రామసభలో పలు అంశాలపై అవగాహన కలిగించారు. ఓటర్ కార్డు, రేషన్‌కార్డు, జన్‌ధన్ ఖాతాలు తెరవటం, గ్రామీణ ఉపాధిహామీ జాబ్‌కార్డును ఎలా పొందటం, కిసాన్ క్రెడిట్ కార్డు పొందటం, ఆయుష్మాన్ భారత్ కార్డును ఎలా పొందవచ్చనే దానిపై అవగాహన కలిగించారు. అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కేంద్రం అమలు చేసే బీమా పథకంలో చేరాలని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి సమ్మయ్య, ఏఈవో సూరిబాబు, బ్యాంకు అధికారులు, ఇతర శాఖల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్(ఆంధ్రజ్యోతి): గిరిజనులకు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఐటీడీఏ ఆధ్వర్యంలో ఇల్లెందు మండలంలోని ఎంపిక చేసిన 5గ్రామపంచాయతీలో అవగాహన గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో దన్‌సింగ్ తెలిపారు. మండలంలోని మామిడిగుండాల, చల్లసముద్రం, రాఘబొయినగూడెం, రొంపేడు, కొమరారం గ్రామపంచాయతిలో ఈనెల 20నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్టీ సామాజిక ప్రజలు గ్రామసభలకు హాజరై సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అభివృద్ధి పనులను పూర్తి చేయాలి: బీఆర్‌ఎస్



ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మణుగూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో అసంపూర్తిగా మిగిలిపోయిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బీఆర్‌ఎస్ కార్యాలయం నుంచి నాయకులు కుర్రి నాగేశ్వరరావు, కుంటా లక్ష్మణ్; రుద్ర వెంకట్, ఆవుల నర్సింహారావు, యాదగిరి గౌడ్, మేకల రవి, జావెద్ పాషా, తురక కోటి, బాబూరావు తదితరులు ప్రదర్శనగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ సెంటర్‌నుంచి బాంబే కాలనీ వరకు గల రోడ్డు విస్తరణ పనులను గత ప్రభుత్వ హయాంలో నాటి ఎమ్మెల్యే రేగా కాంతారావు నిధులు మంజూరి చేయించినప్పటికీ నేటికి రోడ్డు పనులు పూర్తి కాలేదన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మిగులు అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ రామారావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొడుతూరి విక్రమ్, రాహుల్ గౌడ్, రంజిత్ కుమార్, కలగూర శంకర్, మడి వీరన్న బాబు. వెంకటయ్య, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ పాఠశాలలో ప్రవేశాలకు ఎంపికలు



చుంచుపల్లిలో ఎంపికలు నిర్వహిస్తున్న దృశ్యం

జూలూరుపాడు/చుంచుపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): క్రీడా పాఠశాలలో ప్రవేశాల కోసం మండల స్థాయిలో బుధవారం జూలూరుపాడు ఉన్నత పాఠశాలలో ఎంపికలను నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో 4వ తరగతి చదువుతున్న 40 మంది విద్యార్థులు ఎంపికల్లో పాల్గొన్నారు. వారందరికి బ్యాటరీ టెస్ట్‌ను నిర్వహించారు. ఎంఈఓ జుంకీలాల్ ఆధ్వర్యంలో ఎంపికలు చేపట్టారు. ఈ నెల 26, 27 తేదీలలో జిల్లా స్థాయిలో జరిగే ఎంపికలకు 10 మంది విద్యార్థులను ఎంపిక చేస్తామని ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు అరుణ, యుగేందర్, గుగులోత్ నాగేశ్వరరావు, సురేఖ, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

చుంచుపల్లి,(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ స్కూల్‌లో నాలుగో తరగతి ప్రవేశాలకు చుంచుపల్లి మండలంలో బాల, బాలికలకు ఎంపికలు నిర్వహించామని చుంచుపల్లి ఎంఈవో బాలాజీ తెలిపారు. బుధవారం మండలంలోని భారత్ పబ్లిక్ స్కూల్‌లో మండల స్థాయి ఎంపికల్లో తొమ్మిది విభాగాల్లో చేపట్టారు. ఈ నెల 23 నుంచి జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో తెలిపారు. ఈ ఎంపికలకు పాఠశాల ఉపాధ్యాయులు పీడీ భట్టు ప్రేమ్‌కుమార్, స్టెల్లా, ఖదీర్, కవిత తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

» ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు » అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

పాల్వంచ రూరల్/ టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేంత వరకు విశ్రమించనుఅని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని కారేగట్టు, సత్యనారాయణపురం, ప్రభాత్‌నగర్, తవిశలగూడెం, పాండురంగాపురం, పాత సూరారం, సోములగూడెం గ్రామపంచాయతీల పరిధిలోని రూ.కోటి 46లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి పథకం నిర్మాణానికి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తనను నమ్మి అత్యధిక ఓటువేసి గెలిపించి ప్రజలు ఆశించిన అభివృద్ధి సహకారం చేయడమే తన లక్ష్యమన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో ఆదర్శ నియోజకవర్గంగా నిలిపేందుకు ప్రతి చిన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నట్లు, మరింత అభివృద్ధి చేసేందుకు నిరంతరం శ్రమిస్తున్నానని తెలిపారు. అభివృద్ధిలో ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుకున్నామన్నారు. అదేవిధంగా పట్టణ పరిధిలోని శ్రీనివాసకాలనీ మినిస్టేడియంలో సీఎంఆర్ నిధులు రూ.70లక్షలతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి, పంచాయతీరాజ్ డీఈ రామకృష్ణ, ఎలక్ట్రికల్ ఏడీఈ, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, రాష్ట్రసమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, పట్టణ కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబా, జిల్లాసమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, నాగరాజు, మాజీ ఎంపీటీసీ వీరమోహనరావు, కాంగ్రెస్ నాయకులు యర్రంశెట్టి మధ, వివిధశాఖల ఈఈలు, ఏఈలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కూనంనేని